అందరూ చదువుకోవాలన్నదే లక్ష్యం



జగనన్న విద్యాకానుకలను అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు, జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి

యాదమరి: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ చదువుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యం అని పూతలపట్టు ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. ఆయన బుధవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయరెడ్డితో కలసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పేద విద్యార్థి చదువుకోవాలనే ఉద్దేశంతో ఈ సంవత్సరం పాఠశాలల ప్రారంభంలోనే జగనన్న విద్యా కానుక అందిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను నాడు-నేడు పథకం కింద కార్పొరేట్ పాఠశాలలో లేని వసతులు కూడా ప్రభుత్వ పాఠశాలలో కల్పిస్తున్నట్లు వివరించారు. జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం అందిస్తున్నారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరూ జగనన్నకు రుణపడి ఉండాలని కోరారు. జెడ్పీ వైస్ చైర్మన్ ధనంజయ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో గతంలో తెలుగు మీడియం మాత్రమే ఉండేదని, ప్రస్తుతం జగనన్న ముఖ్యమంత్రి అయిన తరువాత ఇంగ్లీష్ మీడియం అందుబాటులోకి వచ్చిందన్నారు. ఎంఈఓ రుక్మిణీ మాట్లాడుతూ మండల పరిధిలో ప్రాథమిక పాఠశాలలు 54, ప్రాథమికోన్నత పాఠశాలలు 10, ఉన్నత పాఠశాలలు 07 ఉండగా, మొత్తం 4036 విద్యార్థులు ఉన్నారని చెప్పారు. వీరందరికీ జగనన్న విద్యాకానుకలు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, ఎస్ఐ సుమన్, పాఠశాల హెచ్ఎంలు గిరిరాజ, భాస్కర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

ప్రజల కోసమే ప్రభుత్వం

చిత్తూరు అర్బన్ : పేదల అభివృద్ధి ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. చిత్తూరు నగరంలోని 25వ వార్డులో బుధవారం పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పేదలను అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో నడిపించేలా చర్యలు తీసుకుంటోందని గుర్తుచేశారు. ఇల్లు లేని పేదలు దరఖాస్తు చేసుకుంటే అర్హతను బట్టి 90 రోజుల్లో పట్టాలు ఇస్తోందన్నారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ , తహసీల్దార్ కిరణ్ పాల్గొన్నారు.

బీఎస్ఆర్ పేట జాతరలో ఎమ్మెల్యే

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం బీఎస్ఆర్ పేట గ్రామంలో బుధవారం గంగ జాతరను ఘనంగా నిర్వహించారు. ఈ జాతర మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అమ్మవారికి గజమాల సమర్పించారు. జాతర నిర్వాహకులు గంగమ్మ దర్శన భాగ్యం కల్పించి ఘనంగా సన్మానించారు. మేయర్ అముద, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, నాయకులు త్యాగరాజులు, ప్రతిమారెడ్డి, భాస్కర్ రెడ్డి, కష్టారెడ్డి, అప్పు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగులకు నగదు పురస్కారాలు

చిత్తూరు రూరల్: నగరంలోని టూ డిపోలోని ఉద్యోగులకు బుధవారం అభినందన సభ నిర్వహించారు. ఉత్తమ పనితీరు కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లకు నగదు పురస్కారాలు అందజేశారు. పలు రూట్లల్లో అధిక ఆదాయానికి కృషి చేసిన డ్రైవర్లు రాంబాబు, కందన్, కండక్టర్లు మురళి, నిర్మలను అసిస్టెంట్ మేనేజర్ అల్తాఫ్ నగదు పురస్కారాలతో సత్కరించారు.

సమస్యలను పరిష్కరిస్తాం

యాదమరి: మండల పరిధిలో నెలకొన్న విద్యుత్ సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్‌శాఖ ఏడీ కొండన్న తెలిపారు. మండలంలోని మోర్థానపల్లె విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మండల పరిధిలోని విద్యుత్ సమస్యలను వారికి వివరించారు. దీనిపై విద్యుత్‌శాఖ ఏడీ మాట్లాడుతూ మండలంలో విద్యుత్ సమస్యలు ఉంటే నేరుగా అధికారులకు తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ గుర్రప్ప పాల్గొన్నారు.

బదిలీలకు నేడు కౌన్సెలింగ్

చిత్తూరు అర్బన్ : జిల్లాలోని వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి కౌన్సెలింగ్ ప్రక్రియ గురువారం ఉదయం 8.30 గంటల నుంచి ప్రారంభించనున్నట్లు నగర కమిషనర్ అరుణ తెలిపారు. బదిలీల కోసం వివిధ కేటగిరీల కింద ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న అడ్మిన్, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్, వెల్ఫేర్, శానిటేషన్ ఎన్విరాన్మెంట్, ప్లానింగ్ కార్యదర్శులు 116 మంది కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. బదిలీల కోసం నగరపాలక సంస్థ ఆవరణలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. బదిలీల ప్రక్రియ పర్యవేక్షకులుగా ఆర్డీటీపీవో బి.సుదర్శన్, అనంతపురం ఆర్డీఎంఏ కార్యాలయం అధికారులు అనీప్, ఇలియాజ్ హాజరవుతున్నట్లు తెలిపారు.

ఇంప్రూవ్‌మెంట్లో ప్రతిభ

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారని కరస్పాండెంట్ ప్రకాశ్‌చంద్రారెడ్డి పేర్కొన్నారు. నగరంలోని కొంగారెడ్డిపల్లిలో ఉన్న శ్రీ విద్యావికాస్ కళాశాలలో ఎంపీసీ చదువుతున్న దీపిక 470 మార్కులకు 466, మౌనిక 466 మార్కులు సాధించారన్నారు. బైపీసీలో లిఖిత 440 మార్కులకు 425, పల్లవి 440 మార్కులకు 424 మార్కులు సాధించారని తెలిపారు.

ఇందిరమ్మ కాలనీలో గంగజాతర



ఇందిరమ్మ కాలనీలో కొలువుదీరిన గంగమ్మ

బంగారుపాళెం: మండలంలోని తగ్గువారిపల్లె పంచాయతీ ఇందిరమ్మకాలనీలో బుధవారం గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జాతరలో భాగంగా మంగళవారం ఉదయం అంబళ్లు, సాయంత్రం పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. రాత్రి అమ్మవారి శిరసును విశేషంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. బుధవారం తెల్లవారు జామున గ్రామ నడివీధిలో ఏర్పాటు చేసిన మండపంలో గంగమ్మను కొలువు దీర్చారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారిని జలధికి తరలించారు.

గో సంరక్షణ ట్రస్ట్‌కు రూ.50 వేలు విరాళం



దాతకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు న్యూఢిల్లీకి చెందిన మాధవ కుమార్ రూ.50 వేలును ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డికి అందించారు. దాత కుటుంబ సభ్యులతో కలసి స్వామివారి దర్శనార్థం విచ్చేసి స్వామివారి గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం అందించారు. వారికి ఆలయ చైర్మన్ స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఈఏపీసెట్ ఫలితాల్లో నగర విద్యార్థుల ప్రతిభ



సాయితేజరెడ్డిని అభినందిస్తున్న వివేకనంద కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ



శ్రీ చైతన్య కళాశాల విద్యార్థి లోహిత్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన ఈఏపీసెట్ ఫలితాల్లో నగర విద్యార్థులు ప్రతిభ చాటారు. నగరంలోని మురగానిపల్లిలో ఉన్న శ్రీ వివేకానంద (పీఎస్ఎస్) కళాశాలలో చదివిన విద్యార్థులు ఇంజనీరింగ్ విభాగంలో సాయితేజరెడ్డి 734, నితిన్ 2637, మౌనిక 3124, తరుణ్ స్కంధ 4416 ర్యాంకులను సాధించగా, అగ్రికల్చర్ విభాగంలో సౌజన్య 2968, గీతశ్రీ 5636, శ్రీప్రియ 8945 ర్యాంకులు సాధించారని ఆ కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ, ప్రిన్సిపల్ నాగరాజశెట్టి తెలిపారు. గాంధీరోడ్డులో ఉన్న శ్రీ చైతన్య కళాశాలకు చెందిన లోహిత్ 2934, సుదర్శన్ 6839, రెడ్డి శ్రీనివాస్ 8602 ర్యాంకులను సాధించారని ఆ కళాశాల ఏజీఎం ప్రసాద్, ప్రిన్సిపల్ శివకుమార్ లు వెల్లడించారు.

భూమార్పిడి చేసుకున్నాం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీదేవి

చిత్తూరు రూరల్: తమ తండ్రి పేరుతో ఉన్న భూమిని కొంత మేరకు వేరే వ్యక్తికి ఇచ్చి భూ మార్పిడి చేసుకున్నామని శ్రీదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. నగరపరిధిలోని బండపల్లి రెవెన్యూలో తన తండ్రి కన్నయ్యనాయుడు 0.95 సెంట్ల భూమిని తీసుకుని 19 సెంట్ల భూమిని చిన్నబ్బనాయుడుకు మార్చి ఇచ్చారన్నారు. ఇప్పుడు ఆభూమి తమకే చెందుతుందని చిన్నబ్బనాయుడు, కన్నమ్మ దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు.

కూలీలకు వంద రోజులు పని కల్పించాలి





ఉపాధి పనులను తనిఖీ చేస్తున్న పీడీ గంగాభవానీ, కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ గౌరి

బంగారుపాళెం: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద కుటుంబానికి వంద రోజులు పని కల్పించాలని ప్రాజెక్టు డైరెక్టర్ గంగాభవాని తెలిపారు. మండలంలోని జిల్లేడుపల్లె పంచాయతీలో ఉపాధి హామీ పనులను బుధవారం ఆమె తనిఖీ చేశారు. చిగరగుట్ట నుంచి బీమన్న చెరువు వరకు ఫీడర్ చానల్ పనులు, చెరువు పూడికతీత పనులను పరిశీలించారు. జాబ్‌కార్డులు కలిగిన దివ్యాంగులకు పని కల్పించాలని సూచించారు. సకాలంలో కూలీలకు బిల్లులు చెల్లించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ కిరణ్‌కుమార్, ఈసీ గణేష్, ఫీల్డ్‌అసిస్టెంట్ వేణు పాల్గొన్నారు.

లక్ష్యాలను పూర్తి చేయండి

పూతలపట్టు: కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఎంపీడీఓ గౌరి అన్నారు. బుధవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో ఉపాధి పనులను పరిశీలించారు. కూలీల సంఖ్యను పెంచాలని ఫీల్డ్ అసిస్టెంట్‌కు సూచించారు. ఉదయం పూట ఎండకు ముందే కూలీలు హాజరుకావాలని స్పష్టం చేశారు. ఇప్పటికే మండలంలో 5 పంచాయతీల్లో పనితీరు మెరుగ్గా లేకపోవడంతో ఫీల్డ్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసినట్లు ఆమె పేర్కొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ సేవలు వరం



తవణంపల్లె: కృష్ణాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

ఐరాల: ప్రభుత్వం అమలు చేస్తున్న ఫ్యామిలీ డాక్టర్ విధానం పేద ప్రజలకు వరం అని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని వేదగిరివారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 60 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఇళ్ల వద్దకే వెళ్లి రోగుల ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ వ్యాయామం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కృష్ణాపురంలో...

తవణంపల్లె: మండలంలోని కృష్ణాపురంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ 55 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. గర్భవతులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు సుబ్రమణ్యం రెడ్డి, చాముండేశ్వరి, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోత్స్న, డీఈఓ విజయలక్ష్మి, ఆశావర్కర్లు రేణుక, అలివేలు, సావిత్రి, ద్రాక్షాయణి పాల్గొన్నారు.

ప్రతి చిన్నారికి టీకా

యాదమరి: గ్రామాలలో ఉన్న ప్రతి చిన్నారికి వ్యాధి నిరోధక టీకా వేయాలని సీహెచ్ఓ లక్ష్మీనారాయణ కోరారు. బుధవారం ఉదయం యాదమరి ప్రభుత్వ పాఠశాలలో ఆస్పత్రి ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఏఎన్ఎంలు గ్రామాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి చిన్నారులను గుర్తించి వ్యాధి నిరోధక టీకాలు వేయాలని కోరారు. టీకాలు వేయడంతో చిన్నారులు ఆరోగ్యంగా ఉంటారని శిశు మరణాలు తగ్గించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



యాదమరి: సమావేశంలో మాట్లాడుతున్న సీహెచ్ఓ లక్ష్మీనారాయణ

క్లుప్తంగా

బడుల్లో నాణ్యమైన విద్యాబోధన



పిల్లలకు విద్యాకానుక అందజేస్తున్న జెడ్పీటీసీ

చిత్తూరు రూరల్: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యాబోధన అందుతోందని జెడ్పీటీసీ సభ్యుడు ఎం.ఎస్ బాబునాయుడు అన్నారు. చిత్తూరు మండలం అనంతాపురం ఎంపీపీ పాఠశాలలో బుధవారం ఆయన జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి చేస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు నిర్మల పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి



రక్తదానం చేస్తున్న దాతలు

చిత్తూరు రూరల్ : ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని డీఐఓ రవిరాజు అన్నారు. నగరంలోని అపోలో మెడికల్ కాలేజీ, సీపీఎఫ్ ఫ్యాక్టరీలో బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని నిర్వహించారు. పలువురు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. మొత్తం 178 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసరావు, అమరనాథ్, అపోలో నరేష్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెర్లోపల్లి సచివాలయం తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలంలోని చెర్లోపల్లి సచివాలయాన్ని బుధవారం ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి తనిఖీ చేశారు. పలు రికార్డులను, హాజరు పట్టికను పరిశీలించారు. తర్వాత ప్రభుత్వ పథకాల అమలు, లబ్ధిదారుల వివరాలు, పెండింగ్ దరఖాస్తు వివరాలను సిబ్బంది ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ నిర్ణీత సమయంలో అటెండెన్స్ వేయాలన్నారు. వచ్చిన దరఖాస్తులు, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చూడాలని ఆయన పేర్కొన్నారు.

సీఐగా నాగార్జునరావు



బంగారుపాళెం: బంగారుపాళెం అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ సీఐగా నాగార్జునరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. కర్నూలు జిల్లా నుంచి నాగార్జునరావు బంగారుపాళెంకు బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న సీఐ నరసింహారెడ్డి వీఆర్‌కు వెళ్లారు.

ఎంపీడీవోల బాధ్యతల స్వీకరణ



సుధాకర్‌రెడ్డి

చిత్తూరు రూరల్: చిత్తూరు ఎంపీడీవోగా సుధాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాజంపేటలో ఈఓపీఆర్డీగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం ఉద్యోగోన్నతిపై చిత్తూరు ఎంపీడీవోగా నియమించింది. బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు.



అబ్దుల్‌కలామ్ ఆజాద్

తవణంపల్లె: ఎంపీడీవోగా అబ్దుల్‌కలామ్ ఆజాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కలికిరి మండలంలో ఈఓపీఆర్‌డీగా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్‌కలామ్ ఆజాద్ పదోన్నతిపై తవణంపల్లె ఎంపీడీఓగా నియమితులయ్యారు.

నేలవాలిన విద్యుత్ స్తంభాలు



గుడిపాలలో నేలవాలిన కరెంటు స్తంభం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్ డివిజన్ పరిధిలో ఇటీవల కురిసిన గాలివానకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయని ఈఈ పద్మనాభపిళ్లై తెలిపారు. చిత్తూరు నియోజకవర్గంతో పాటు ఆవులకొండ, పెనుమూరు, గంగాధర నెల్లూరు, పూతలపట్టు, పాలసముద్రం మండలాల్లో మొత్తం 26 విద్యుత్ స్తంభాలు నేలవాలినట్లు వివరించారు. దీంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్లు 20 ట్రాన్స్‌ఫార్మర్లు, 11 కేవీ డిస్కులు 12, పిన్స్ 14 దెబ్బతిన్నాయని చెప్పారు. డీఈ, ఏఈ, సిబ్బంది సంరక్షణ పనులు చేపడుతున్నట్లు వివరించారు.

ఎంసెట్‌లో మంగళ్ విద్యాలయ సత్తా

పూతలపట్టు: మండలంలోని పేటమిట్ట పంచాయతీలో మంగళ్‌విద్యాలయ విద్యార్థులు ఎంఎసెట్‌లో సత్తా చాటినట్లు యాజమాన్యం ఓ ప్రకటనలో తెలిపింది. ఎస్ హేమంత్‌కుమార్‌రెడ్డి (2,763), టి.పూర్ణచంద్ర(3,004), యస్ దినేష్ కుమార్(4,722), కె.మౌనిక(6,093), నైపుణ్య (9,112), భార్గవి(9,243), గిరిష్మ(10,730) వరుసగా రాష్ట్ర స్థాయిలో నిలిచి పాఠశాల కీర్తిని పెంచారన్నారు.